సాంఘిక సంక్షేమ గురుకులం..
అన్నింటిలోనూ అగ్రస్థానం

- గురుకులాల్లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' విద్యాలయం
- రాష్ట్రంలో అత్యధిక ఉన్నతవిద్యా సౌకర్యం పొందుతున్న విద్యార్థులు
- ఫలితాల్లోనూ టాప్ ప్లేస్ సాధన
- ప్రతిభ చూపుతున్న గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాలికలు



గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకులబాలికల కళాశాల, పాఠశాల ప్రధాన భవనం



చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్న విద్యార్థినులు

రాయదుర్గం: నాణ్యమైన విద్యాబోధన..ఫలితాల సాధన..ఉన్నత విద్యాకోర్సులలో సీట్లు ..అత్యాధునిక సౌకర్యాల కల్పనలో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, పాఠశాల తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోంది. అందుకే ఈ విద్యాలయానికి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా గుర్తింపు ఇచ్చారు. ముఖ్యంగా అంతా పేదింటి,గ్రామీణ ప్రాంత పిల్లలు కావడంతో ప్రత్యేక శ్రద్ధతో వీరిపై దృష్టి పెట్టి వీరికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఉన్నత విద్యా సంస్థల్లో ముఖ్యంగా ఐఐటీ, ఎన్ఐటీ, ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో సీట్లు సాధించడం లో గురుకులాల్లోనే టాప్‌గా నిలుస్తున్న విద్యా సంస్థగా గుర్తింపును గత కొన్నేళ్ళుగా సాధిస్తూ ముందుకు సాగు తోంది. చదువుతోపాటు క్రీడలలోనూ తన కంటూ ప్రత్యేకతను సాధిస్తూ ప్రైవేటు విద్యాసంస్థలకు సవాల్‌ను విసురుతోంది. నాణ్యమైన విద్య బోధనలో తనదైన శైలిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలనే పట్టుదలతో ఉండే అధ్యాపకులు, ఉపాధ్యాయులే కాకుండా విద్యార్థులు, ప్రిన్సిపల్, వైస్‌ప్రిన్సిపల్‌లోనూ కనిపిస్తోంది. గత కొన్నేళ్ళుగా తనకంటూ ఒక ప్రత్యేకతను ఈ విద్యా సంస్థ సాధించడం విశేషం.

పరీక్షలు ఏవైనా ఫలితాలు టాప్

- పదవ తరగతి, ఇంటర్ ఫలితాలలో టాప్ ప్లేస్ నిలుస్తోంది ఈ కళాశాల, పాఠశాల.
- ప్రతి యేటా 100 శాతం ఫలితాల సాధనలో తనకంటూ ప్రత్యేకతను సాధిస్తూ వస్తోంది.
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ చొరవ అధ్యాపకులు, ఉపాధ్యాయులు కృషి, విద్యార్థుల పట్టుదలతోనే ఈ ప్రతిభ చాటేందుకు అవకాశం కలుగుతోంది.
- ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల సాధనలో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల టాప్‌లో నిలుస్తోంది.
- ఇందులో 'ఆపరేషన్ బ్లూ క్రిస్టల్' పథకాన్ని 2015లో ప్రారంభించగా సత్ఫలితాలు ఇస్తోంది. అందులో భాగంగా 2015-16లో 43 మందికి, 2016-17లో 54 మందికి, 2017-18లో 45 మందికి, 2018-19 లో 78 మందికి, 2019-20లో 122 మందికి, 2020-21లో 203 మందికి ఎంబీబీఎస్, బీడీఎస్‌సీట్లు సాధించడం విశేషం.

చదువుతోపాటు క్రీడల్లోనూ టాప్..

- చదువులోనేకాకుండా విద్యార్థినీలు క్రీడల్లోనూ రాణించేలా వారికి ప్రత్యేక తర్ఫీదును ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత. విద్యార్థినులు క్రీడల్లోనూ మక్కువ పెంచడంలోనూ ముందుంది.
- అర్చన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్‌లో ఇప్పటికే బంగారు పతకాన్ని జాతీయస్థాయిలో పొందింది
- ఫుట్‌బాల్‌లో 8వ తరగతి కోమలిక ఆలిండియా స్థాయిలో కాంస్యపతకాన్ని సాధించింది.
- 2018, 2019లో ఏడు సార్లు కోకో క్రీడలో 9వ తరగతి విద్యార్థిని కె దీక్షిత రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలను , రెండుసార్లు జాతీయ స్థాయి పోటీలో పాల్గొనడం విశేషం.
- 6 సార్లు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో 9వ తరగతి భవిత బంగారు పతకాన్ని సాధించడమే కాకుండా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది.
- అండర్-17 హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీలో అర్చన స్వర్ణపతకం పొందింది.
- 2018, 2019లో రాష్ట్ర స్థాయి వివిధ క్రీడలలో 43 పతకాలను ఈ విద్యాసంస్థ పొందడం విశేషం.
- 2018,2019లో జాతీయ స్థాయి క్రీడా పోటీలలో 8 మంది విద్యార్థినీలు పాల్గొనడం విశేషం.

సమిష్టి కృషి, ఉన్నతాధికారుల ప్రోత్సాహంతోనే సాధ్యం..



ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థుల సమష్టి కృషి, ఉన్నతాధికారుల ప్రోత్సాహంతోనే కళాశాల/పాఠశాల అభివృద్ధి చెందుతోంది. పరీక్షలు ఏవైనా అన్నింటిలోనూ అత్యుత్తమ ప్రతిభను విద్యార్థినీలు చాటుతున్నారు. చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించేలా వారిని ప్రోత్సహించడమే కాకుండా శిక్షణ కూడా ఇప్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి అన్నింటిలోనూ రాణించేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. అత్యాధునిక సౌకర్యాల కల్పన, బోధన, ఇతర అన్నింటిలోనూ ఉన్నతాధికారులు ముఖ్యంగా కార్యదర్శి నిరంతరం పర్యవేక్షించడం, సలహాలు ఇవ్వడంతోనే ఇదంతా సాధ్యమవుతోంది. భవిష్యత్తులో మరింత రాణించేలా చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తాం.

– శారద-ప్రిన్సిపల్ గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాల

క్లుప్తంగా

రైల్వే సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్, ఫలక్‌నామాలకు వెళ్ళే ఎంఎంటిఎస్ రైళ్ళ వేళలు ఇలా వున్నాయి.

నాంపల్లి వైపు వెళ్ళే ఎంఎంటీఎస్ రైళ్ళు: ఉదయం: 6:40, 7:40, 8:10, 9:15, 10:15, 11:10 , 11:55
మధ్యాహ్నం: 12:50 , 13:20 , 14:25, 15:20
సాయంత్రం: 16:10, 17:55
రాత్రి:,18:55, 20:05, 21:25
సికింద్రాబాద్ వరకు: రాత్రి 22:50, 23:25
ఫలక్‌నామా వైపు వెళ్ళే ఎంఎంటీఎస్ రైళ్ళు: ఉదయం: 5:50, 6:30, 6:50, 8:25, 9:05, 9:31, 10:05, 11:20 , 11:40.
మధ్యాహ్నం: 12:40, 13:25, 14:40, 14:55 , 15:10
సాయంత్రం: 16:35, 17:10, 17:30, 18:00,18:35
రాత్రి: 19:10, 19:55, 21:00, 21.15, 21:45.

ఉత్సాహంగా సైక్లథాన్



సైక్లిస్టులతో మాట్లాడుతున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తదితరులు

మాదాపూర్: ఫిట్‌నెస్‌పై చిన్నారులకు, పెద్దలకు అవగాహన కల్పించడం ముఖ్యమని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్ వద్ద ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా 10కిలో మీటర్ల సైక్లోథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గచ్చిబౌలి స్టేడియం నుండి ఇనార్బిట్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీసీపీ శిల్పవల్లి తెలంగాణ క్రీడాభివృద్ధి సంస్థ అధ్యక్షులు డాక్టర్ అంజనేయగౌడ్ నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. ఆస్ట్రోనిక్స్ సీఈఓ మేఘనాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

బంగారు గొలుసు స్వాధీనం

కేపీహెచ్‌బీకాలనీ: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకొని పారిపోయిన ఓ యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి సుమారు 39 గ్రాముల పుస్తెల తాడును స్వాదీనం చేసుకున్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. శుక్రవారం నిజాంపేట రోడ్డు ప్రాంతంలోని ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉండే శంకబాతుల మహాలక్ష్మి (56) భర్త, కొడుకు డ్యూటీకి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉంది. ఉదయం 11.30 గంటల సమయంలో అదే కాలనీలో నివాసం ఉండే ఎం. కోటేశ్వరరావు (24) మహాలక్ష్మి ఇంటికి వెళ్లి తలుపు కొట్టడంతో గడియతీసింది. వెంటనే ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తెంచుకునేందుకు యత్నించగా ఆమె తీవ్రంగా ప్రతిఘటించింది.

- దీంతో ఆమె కళ్లలోకి గుర్తు తెలియని పౌడర్‌ను చల్లిన వెంకటేశ్వరావు బంగారు గొలుసును తెంచుకొని బయట గడియపెట్టి పారిపోయాడు. స్థానికుల సహకారంతో మహాలక్ష్మి కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి పుస్తెలతాడును స్వాదీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఫిర్యాదు అందిన ఒక్కరోజులోనే నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ చూపిన బాలానగర్ సీసీఎస్ పోలీసులు, కేపీహెచ్‌బీ క్రైమ్ విభాగం సిబ్బందిని సైబరాబాద్ ఉన్నతాధికారులు అభినందించారు. విలేకరుల సమావేశంలో కేపీహెచ్‌బీ సీఐ కిషన్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

గడప గడపకు బీజేపీ

ఆల్విన్‌కాలనీ: గడప గడపకు బీజేపీ పాదయాత్రలో భాగంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. మాతృదినోత్సవం సందర్భంగా మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సమస్యలపై మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకుల పాలనలో ఎక్కడా చూసినా సమస్యలే కనిపిస్తున్నాయని అన్నారు. ప్రజలు ఈ అవినీతి పాలనతో విసిగిపోయి ఉన్నారని అన్నారు. ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా బీజేపీ పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు పర్వతాలుయాదవ్, శ్రీహరియాదవ్, రాజిరెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్ పటేల్, శ్రీధర్ పటేల్, రమేష్‌యాదవ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

స్క్రాప్ విక్రయాలపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలి

బాలానగర్: బాలానగర్ పారిశ్రామిక వాడలోని ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్ లిమిటెడ్ (ఐడీపీఎల్) మందుల పరిశ్రమలోని స్క్రాప్ విక్రయాలపై వస్తున్న ఆరోపణలపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అక్రమ విక్రయాలలో కేంద్ర ప్రభుత్వ అధికార పార్టీ పెద్దల హస్తం ఉన్నట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులను, ప్రజలను ఐక్యం చేసి ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

మౌలిక వసతుల కల్పనలో బీఆర్‌ఎస్ విఫలం



పాదయాత్రలో సమస్యలు పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్

మియాపూర్: కనీస మౌలిక వసతులు కల్పించడంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆరంభ టౌన్ షిప్, రాజీవ్ గృహ కల్ప, పాపిరెడ్డి కాలనీలో 48వ రోజు పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాలనీ, బస్తీల్లో ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గత 8 ఏళ్ల పాలనలో ఎక్కడ అభివృద్ధి జరగలేదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలే కడుపు నింపుకుంటున్నారని సామాన్య ప్రజలకు కనీస మౌలిక వసతులు కూడా కల్పించడం లేదన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయం

మోతీనగర్: తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు సాధారణ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని కూకట్‌పల్లి నియోజకవర్గం బీ-బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ పేర్కొన్నారు. ఆదివారం మోతీనగర్ చౌరస్తాలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని సుభిక్షంగా పాలించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో పల్లపు వేణు, బి. సత్యనారాయణ గౌడ్, సుధాకర్ రెడ్డి, నరసింహ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..



రాయదుర్గంలోని వ్యాయామశాలలో..

గచ్చిబౌలి: ఆంజనేయస్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాయదుర్గం, గచ్చిబౌలి,నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, కొత్తగూడ,కొండాపూర్, గోపన్‌పల్లి,ఎన్టీఆర్‌నగర్, జీపీఆర్‌ఏక్వార్టర్స్, టెలికామ్‌నగర్, ఇందిరానగర్ వంటి ప్రాంతాలలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకారాలు చేశారు. అనంతరం వడమాల, తమలపాకులతో ప్రత్యేక ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించారు.

- రాయదుర్గంలోని వ్యాయామశాలలో భారతీయ యువజన సంఘం ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు. సామూహిక హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించారు. వీహెచ్‌పీ గొల్కొండ జిల్లా సేవా ప్రముఖ్ ఎస్ నిఖిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.
- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.అభిషేకం, ప్రత్యేక అలంకారం, సహస్రనామార్చన, మనుసూక్త సహిత హనుమత్ హోమమ్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డిపార్వతి పర్యవేక్షణలో అర్చకులు నిర్వహించారు.

మియాపూర్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారద పీఠపాలిత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత హారతీ, నిత్య అర్చనలు, ప్రత్యేక హోమాలు, పూర్ణాహుతి, ఆభాంజనేయస్వామికి అష్టోత్తర శతకలషము, పంచామృతాభిషేకం, పండ్ల రసాలు, కొబ్బరి జలంలతో మహాభిషేకం నిర్వహించారు. స్వామివారిని పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలకంరించి పూజలు నిర్వహించారు.

బ్రాహ్మణ బ్రహ్మచారులకు సామూహిక ఉపనయనం



సాక్షి, సిటీబ్యూరో: స్థానిక నిజాంపేట్‌లోని శ్రీ కామాక్షి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ బ్రహ్మచారులకు సామూహిక ఉపనయన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శంకర మఠంలో జరిగిన ఈ కార్యక్రమంలో 17 మంది వటువులకు వేద మంత్రాలతో, శాస్త్రోక్తంగా ఘనపాఠి దుర్గాచరణ్ బృందం పర్యవేక్షణలో ఉపనయన కార్యక్రమాన్ని జరిపించారు. ఇందులో వటువు బంధువులు, సంఘకార్య వర్గ సభ్యులు తదితరులు దాదాపు 500 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లకు మోతీనగర్‌లోని శ్రీ గురుదత్త సేవా ట్రస్ట్ సహకారం అందించగా సంఘకార్య వర్గ సభ్యులు పీ.ఎస్. శంకర్, ఎస్‌వీఎల్ నరసింహారావు, రామవరపు సుధాకర్, ఆర్.కరుణాకర్, భువనేశ్వరీ, రమణి, కళ్యాణి, భవాని తదితరులు పర్యవేక్షించారు.

'కాలనీల కాంటాక్ట్' సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గం: కాలనీల కాంటాక్ట్ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కన్నారు. ప్రతికాలనీ, బస్తీ, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లలో గల పలు సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ, వివిధ ప్రభుత్వ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా వెళ్ళి సమస్యలు తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టానన్నారు.

'సీఐఎస్‌సీఈ' ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

రాయదుర్గం: సీఐఎస్‌సీఈ ఫలితాలను ఆదివారం ప్రకటించారు. ఇందులో గచ్చిబౌలిలోని నాజర్ బాయ్స్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పదవ తరగతిలో హంజా నిసార్ భాషా 99.6 శాతం, మీర్జా ఆయాన్ బేగ్ 98.4 శాతం, జి.అభినవ్ వర్మా 97.2 శాతం మార్కులను సాధించారు. అలాగే 12వ తరతగతిలో ఉర్వాహ్ మహ్మద్ పారూఖ్ 87.75 శాతం, ఇబాద్ రహమాన్ 86.5 శాతం మార్కులను సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ హఫీజుద్దిన్ ఆహ్మద్ అభినందించారు.

ఐఎస్‌సీ ఫలితాల్లో..

ఐఎస్‌సీ ఫలితాల్లో ముగ్గురు డిస్టింక్షన్, ఫస్ట్ క్లాస్‌లో అయిదుగురు ఉత్తీర్ణత సాధించారు. కాగా ఐసీఎస్‌ఈ ఫలితాల్లో 95 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 95 మంది ఉత్తీర్ణులయ్యారు.

బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి

ఆల్విన్‌కాలనీ: యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ మేనేజర్ కె. రాములు ఆధ్వర్యంలో ఎల్లమ్మబండ జయశంకర్ కాలనీ కమ్యూనిటీహాలులో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను కుమార్‌యాదవ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి అంకితభావంతో కూడిన జీవితాన్ని నిర్మాణం చేసుకోవాలని సూచించారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధన కోసం పనిని ప్రారంభించి మొక్కవోని దీక్షతో కృషి చేస్తే తప్పకుండా విజయం వరిస్తుందన్నారు. తల్లిదండ్రులతో, అధ్యాపకులతో గాని, సమాజంలో పెద్దలతో గౌరవంగా మాట్లాడే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో ఉండి ఎలాంటి దురలవాట్లకు పాల్పడకుండా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలోనే జీవితాన్ని మంచి వైపు మలుపు తిప్పుకుంటే జీవితంలో అనేక విజయాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు పిరికితనంగా ఉండకుండా జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యను సవాల్‌గా స్వీకరించి ధైర్యంగా ఎదుర్కోవడానికి మానసికంగా, భౌతికంగా సిద్ధమవ్వాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీపతి నాయుడు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్‌లోని శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్ : కళాకారులు కూచిపూడి, భరతనాట్య నృత్యాంశాలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం బెంగుళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి మహిమ హరీష్ తన ప్రదర్శనతో అలరించింది. ఇందులో శివపంచాక్షరి స్తోత్రం, అదిగో అల్లదిగో, పందం అంశాలను ప్రదర్శించి అలరించారు. కూచిపూడి నృత్యప్రదర్శనలో శైలజ.శ్రీమాత ప్రసన్న శిష్యబృందంచే అలరించారు.

ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మియాపూర్: మియాపూర్‌లోని గ్రేట్ ఆనాథాశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరై వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ మూర్తి ప్రేమ వేల కట్టలేదని, నవమాసాలు కని పెంచి జన్మనిచ్చిన మాతృమూర్తి నిస్వార్థమైనదని పేర్కొన్నారు. తల్లిని మించిన దైవం లేదన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ జనార్ధన్, సభ్యులు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ట్రోఫీ అందుకున్న క్రీడాకారులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థి దశ నుంచే యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారంలో నెల రోజులు నిర్వహిస్తున్న జీఎంఆర్ ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే నగదు బహుమతి, ట్రోఫీలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. శిక్షణను పొంది యువకులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలన్నారు. క్రీడలను అభివృద్ధి చేసేందుకు ప్రతీ గ్రామంలో ప్రభుత్వం క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశంగౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.